క్లుప్తంగా

వైద్యశిబిరానికి స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

నెల్లిమర్ల: పట్టణంలోని ఆదిత్య విద్యాలయం ప్రాంగణంలో శ్రీ చిన్నమాంబ సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. విజయనగరం తిరుమల మెడికవర్ ఆస్పత్రి వారు రోగులకు బీపీ, సుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ చంద్రకుమారి గుండెకు సంబంధించిన పరీక్షలు చేపట్టి, పలువురిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. పాఠశాల కరస్పాండెంట్ వి. సూరిబాబు, హెచ్‌ఎం వి. అమృత పాల్గొన్నారు.

నష్టం జరగకుండా చూడాలి..



మాక్‌డ్రిల్‌లో భాగంగా గాయపడిన వ్యక్తికి చికిత్స చేస్తున్న సిబ్బంది

పూసపాటిరేగ: ప్రకృతి వైపరీత్యాల సమయంలో మత్స్యకారులకు ఎటువంటి నష్టం జరగకుండా చూడాలని రిలయన్స్ ప్రతినిధి జి. తిరుమలరావు అన్నారు. మండలంలోని తీరప్రాంతమైన తిప్పలవలసలో ప్రకృతి వైపరీత్యాలపై శుక్రవారం అవగాహన సదస్సుతో పాటు మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రకృతి వైపరీత్యాల సమయంలో సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు గౌరి, సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

భోగాపురం: మండలంలోని ముక్కాం కూడలి వద్ద ఎస్సై కృష్ణమూర్తి, సిబ్బంది శుక్రవారం ఉదయం వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో రామచంద్రపేట ఉప్పుగెడ్డ నది నుంచి ముక్కాం వైపు వెళ్తున్న ఇసుక ట్రాక్టర్ తనిఖీ చేయగా, ఎటువంటి అనుమతులు లేకపోవడంతో వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భోగాపురం: మండలంలోని భోగాపురం, సుందరపేట, సీహెచ్ గొల్లపేట, సవరవిల్లి పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ జ్ఞానేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

చురుగ్గా పారిశుధ్య పనులు



కొండకరకాంలో పూడికలు తొలగిస్తున్న కార్మికులు

విజయనగరం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పనులు చురుగ్గా జరుగుతున్నాయని ఈఓపీఆర్‌డీ డి. తిరుపతినాయుడు అన్నారు. మండలంలోని కొండకరకాం గ్రామంలో సర్పంచ్ కిలారి రమ్య పర్యవేక్షణలో శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టారు. కాలువల్లో పూడికలను తొలగించి ట్రాక్టర్లతో తరలించారు.

సుదర్శన్ ఆళ్వార్‌కు ప్రత్యేక పూజలు



సుదర్శన ఆళ్వార్‌కు పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

విజయనగరం రూరల్: ప్రముఖ భారతీయ తత్వదర్శన కేంద్రం శ్రీక్షేత్రమ్‌లో కొలువై ఉన్న అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వెంకటేశ్వరుని దేవాలయంలో సుదర్శన ఆళ్వార్‌కు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిత్తా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు చామర్తి శ్రీనివాస రమేష్ ఆచార్యులు, రమేష్ ఆచార్యుల ఆధ్వర్యంలో వేదమంత్రాలతో సుదర్శన ఆళ్వార్‌కు అభిషేకం, అర్చనతో పాటు సుదర్శన హోమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి..

- ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా వైఎస్సార్‌సీపీ నాయకుల ప్రచారం



విజయనగరం: సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న నగర మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, తదితరులు

విజయనగరం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి.. అందిస్తున్న సంక్షేమాన్ని చూసి పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు ఓటేయాలని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పిలుపునిచ్చారు. సీతంరాజుకు మద్దతుగా నగరంలోని కొణిశవీధి, వైఎస్సార్ నగర్, వీటీ అగ్రహారం ప్రాంతాలలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యా రంగంలో సమూల మార్పులు తీసుకువచ్చి అమ్మఒడి, విద్యా దీవెన, విదేశీ విద్యా రుణం పేరిట ఎంతోమంది విద్యార్థులకు మెరుగైన భవిష్యత్‌ను అందిస్తున్న ముఖ్యమంత్రి జగనన్న పాలన చూసి సీతంరాజును గెలిపించాలని కోరారు. అలాగే విజయనగరం నియోజకవర్గంలో 30 ఏళ్లలో ఎన్నడూ జరగని అభివృద్ధిని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మూడేళ్లలో చేసి చూపించారని తెలిపారు. సుధాకర్‌ను గెలిపిస్తే ఉత్తరాంధ్ర ఎంతో అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ప్రచార కార్యక్రమంలో కార్పొరేటర్ తాళ్లపూడి సంతోషి, మహిళా విభాగం నేతలు వంతరాం అనూష, తాటితూరి ఉషారాణిలతో పాటు ఆయా డివిజన్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్ విజ్జీ స్టేడియంలో....

ఈ నెల 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అఖండ విజయం చేకూర్చాలని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి. ఈశ్వర్‌కౌశిక్, పార్టీ జిల్లా సీనియర్ సిటిజన్ విభాగం నాయకుడు కేవీవీ కృష్ణారావు, 5వ డివిజన్ కార్పొరేటర్ గాదం మురళి పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. నగర శివారులో గల సర్ విజ్జి స్టేడియం, పరిసర ప్రాంతాలలో ఎన్నికల ప్రచారంలో పాల్గొని పట్టభద్రుల ఓటర్లను కలిశారు. ప్రచారంలో కేఏపీ రాజు, చింతలపాటి వర్మరాజు, ఉషారాణి, చిట్టిరాజు, నైదాన రామకృష్ణ, కొండ్రు శ్రీనివాసరావు, ఆబోతుల శ్యామ్, ఆకుల సురేష్, జామి నారాయణరావు తదితరులు ఉన్నారు.



భోగాపురం: బైరెడ్డిపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి

విద్యారంగానికి పెద్దపీట

భోగాపురం: విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా మండలంలోని బైరెడ్డిపాలెం, సుందరపేట, భోగాపురం, మహారాజుపేట గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బైరెడ్డి ఎర్రప్పలనారాయణ, కొండపు కొత్తయ్యరెడ్డి, కొమ్మూరు సుభోషణరావు, సచివాలయ కన్వీనర్లు పడాల శ్రీనివాసరావు, పడాల భానుప్రకాష్, సుందర హరీష్, పోతిరెడ్డి గోపిరావు, కిలారి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

సీతంరాజును గెలిపించాలి..

విజయనగరం టౌన్: క్రైస్తవ పట్టభద్రులందరూ సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షురాలు మాకిరెడ్డి ఆశాజాన్ విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆమె పర్యటించి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, క్రైస్తవ పట్టభద్రులందరూ తొలి ప్రాధాన్యత ఓటును సుధాకర్‌కు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డేనీ కృపానంద్, ఆర్. ప్రావీణ్య, మనోహర్, మేరీ మాత, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం: నగర శివారుల్లో గల విజ్జీ స్టేడియంలో ప్రచారం నిర్వహిస్తున్న శ్రావణి, ఈశ్వర్‌కౌశిక్



పూసపాటిరేగ: కుమిలిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు, తదితరులు



విజయనగరం టౌన్: ఆత్మీయ బ్రాహ్మణ కలయికలో మాట్లాడుతున్న కోనూరు సతీష్ శర్మ

గెలిపించండి..

విజయనగరం టౌన్: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్‌కు ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యం ఓటు వేసి గెలిపించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ప్రధాన కార్యదర్శి కోనూరు సతీశ్‌శర్మ పిలుపునిచ్చారు. మండపం వీధిలో ఉన్న ఆర్యసోమయాజుల కాశీపతి బ్రాహ్మణ భవనంలో బ్రాహ్మణ ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బ్రాహ్మణ సామాజిక వర్గ సంక్షేమానికి సమాఖ్య ఎప్పుడూ కట్టుబడి ఉంటుందన్నారు. సీతంరాజు విజయానికి సమాఖ్య సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు హెచ్‌కే మనోహర్, ప్రభాకర్, టీవీ.శ్రీనివాస్, గన్నవరపు శ్రీనివాస్, కట్టమూరి చంద్రశేఖర్, డాక్టర్ ఎ.గోపాలరావు, దామరాజు శంకరం, భమిడిపాటి రామ్‌కుమార్‌శర్మ, పప్పు సరోజిని, యామిజాల ప్రభ, కిరణ్మయి, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం టౌన్: ఇంటింటా ప్రచారంలో పాల్గొన్న క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షురాలు మాకిరెడ్డి ఆశాజాన్



విజయనగరం రూరల్: జొన్నవలసలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పూసపాటిరేగలో..

పూసపాటిరేగ: మండలంలోని కుమిలి, సీహెచ్ అగ్రహారం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకుడు మహంతి శ్రీనివాసరావు ప్రచారం నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపడుతున్న పాలన చూసి ఓటెయ్యాలని కోరారు. కార్యక్రమంలో గుజ్జు సురేష్‌రెడ్డి, పడాల శ్రీధర్, కొత్తకోట శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ప్రచారం

విజయనగరం రూరల్: సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా విజయనగరం జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండలంలోని రాకోడు, పినవేమలి, జొన్నవలస, దుప్పాడ తదితర గ్రామాల్లో పట్టభద్రులు ఇళ్లకు వెళ్లి సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో జొన్నవలస పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్ల త్రినాథరావు, నాయకులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

- ఏయూ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ



నృత్యం చేస్తున్న విద్యార్థులు

భోగాపురం: విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఆంధ్రా యూనివర్సిటీ న్యూక్లియర్ ఫిజిక్స్ ప్రొఫెసర్ పీవీ లక్ష్మీనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని లెండి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ కిరణ్ అధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కళాశాల వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పేదలు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ప్రభుత్వం జగనన్న అమ్మఒడి, ఫీజు రియింబర్స్‌మెంట్, విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలను ప్రవేశపెడుతోందన్నారు. అటువంటి పథకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు కాకర్లపూడి శ్రీనివాసరాజు, శ్రీనివాస విద్యాసామంతులు, పతివాడ రమణ, ఎంఎస్ఎన్ రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ పీవీ లక్ష్మీనారాయణ

సీఎం జగన్ మోహన్‌రెడ్డిని కలిసిన కందుల



ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డితో కందుల

భోగాపురం: వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి కందుల రఘుబాబు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం, పార్టీ పటిష్టత, తదితర అంశాలపై చర్చించారు.

ఓటర్ల జాబితా ప్రదర్శన



కొప్పెర్ల సచివాలయం వద్ద ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తున్న కార్యదర్శి, సిబ్బంది

పూసపాటిరేగ: మండలంలోని కొప్పెర్ల పంచాయతీ ఫైనల్ ఓటర్ల జాబితాను సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి ఉమాశంకర్‌తో పాటు సిబ్బంది శుక్రవారం ప్రదర్శించారు. పంచాయతీ సర్పంచ్ పైడి వెంకటరమణ మృతి చెందడంతో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికలు నిర్వహించేందుకు సచివాలయం వద్ద ఓటర్ల జాబితా ప్రదర్శించారు. మండల పరిషత్ కార్యాలయం, గ్రామ పంచాయతీ కార్యాలయం, జిల్లా పంచాయతీ కార్యాలయం వద్ద జాబితాలను వేలాడదీశారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల చదువుపై తల్లిదండ్రుల శ్రద్ధ



విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సూచనలిస్తున్న హెచ్‌ఎం విజయకుమార్, ఉపాధ్యాయులు

విజయనగరం రూరల్: పదో తరగతి పరీక్షల వేళ పిల్లల చదువు, ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జొన్నవలస జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఈపు విజయ్‌కుమార్ కోరారు. మండలంలోని జొన్నవలస ఉన్నత పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా హెచ్‌ఎం విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు రాత్రి సమయంలో విద్యార్థుల ఇంటికి వెళ్లి అభ్యసనపై ఆరా తీస్తున్నారు. శుక్రవారం రాత్రి సారిక, గుండాలపేట గ్రామాల్లో పర్యటించి విద్యార్థులు చదువుతున్నదీ, లేనిదీ గమనించారు. పరీక్ష సమయాల్లో విద్యార్థులు టీవీలు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచే బాధ్యత తల్లిదండ్రులదేనని తెలిపారు. పాఠశాలకు పిల్లలు గైర్హాజరు కాకుండా చూడాలని సూచించారు.

నవధాన్యాల సాగుతో ప్రయోజనం



ద్వారపూడిలో అవగాహన ర్యాలీ

విజయనగరం రూరల్: నవధాన్యాల సాగు వల్ల భూమి సారవంతమై రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది వనజ తెలిపారు. మండలంలోని ద్వారపూడిలో 'నవధాన్యాలు వేద్దాం – నేలతల్లిని కాపాడుకుందాం' కార్యక్రమంలో భాగంగా రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వరి సాగుకు 45 రోజుల ముందుగా ఎకరానికి 13 కిలోల చొప్పున నవధాన్యాలు పొలాల్లో వేయాలని తెలిపారు. దీంతో నేల గుల్లబారి వానపాముల వృద్ధి జరుగుతుందని, అంతేకాకుండా పశువులకు మేతగా ఉపయోగపడుతుందన్నారు.

18న ప్రత్యేక లోక్‌అదాలత్



న్యాయవాదులు, పోలీసులతో సమావేశమైన జడ్జి కనకలక్ష్మి

గజపతినగరం: స్థానిక ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ కోర్టులో ఈనెల 18న నిర్వహించనున్న ప్రత్యేక లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని జూనియర్ సివిల్ జడ్జి బి.కనకలక్ష్మి కోరారు. స్థానిక సివిల్ కోర్టులో ఆమె న్యాయవాదులు, పోలీసులతో కోర్టులో శుక్రవారం సమావేశం నిర్వహించారు. రాజీ కాదగిన కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకునేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. కోర్టులు, పోలీస్ స్టేషన్‌ల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దని వారిని చైతన్యపరచాలని చెప్పారు.

వైభవంగా సహస్ర దీపాలంకరణ

నెల్లిమర్ల రూరల్: రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ సేవ శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. అర్చక స్వాములు వేకువజామున స్వామికి ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన తర్వాత యాగశాలలో ప్రత్యేక హోమాలు జరిపించారు. అనంతరం స్వామి వెండి మంటపం వద్ద నిత్య పూజలు కొనసాగించారు. సాయంత్రం సీతారామచంద్రస్వామిని నూతన పట్టు వస్త్రాలతో సుందరంగా అలంకరించి తూర్పు రాజగోపురం వద్దనున్న ప్రాంగణ వేదికపై ప్రత్యేక ఊయలలో ఆశీనులు చేశారు. అనంతరం దీపాలంకరణ చేసి, వేద మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేక ఊయల్లో స్వామి వారికి ఊంజల్ సేవ జరిపించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



రామతీర్థంలో సహస్ర దీపారాధన

లైంగిక వేధింపులకు పాల్పడితే శిక్ష తప్పదు



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి లక్ష్మీకుమారి

- సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీకుమారి

విజయనగరం లీగల్: అమ్మాయిలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన కారాగార శిక్ష తప్పదని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి బీహెచ్‌వీ లక్ష్మీకుమారి అన్నారు. వీటీ అగ్రహారంలో గల సచివాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ ముగింపు వేడుకల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఆడపిల్లలు దగ్గరి బంధువుల ద్వారా, తెలిసిన వ్యక్తుల ద్వారా ఎక్కువగా లైంగిక వేధింపులకు గురవుతున్నారన్నారు. మహిళా రిసోర్స్‌పర్సన్, సీనియర్ న్యాయవాది పీవీ వరలక్ష్మి మాట్లాడుతూ.. విద్య, వైద్యం, రక్షణ, రవాణా, సేవా రంగాలలో పురుషులతో సమానంగా మహిళలు సేవలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, పోలీసులు, అంగన్‌వాడీ సభ్యులు, గ్రూప్ సభ్యులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగునీరు

భోగాపురం: మండలం కేంద్రంలోని జాతీయ రహదారికి సంబంధించిన సర్వీస్ రోడ్డు కాలువలో చెత్త పెరుకుపోవడంతో మురుగునీరు రోడ్డుపైకి చేరింది. దీంతో సమీప ప్రాంతాల్లో నివాసముంటున్న వారు ఇబ్బంది పడుతున్నారు. హైవే అధికారులు జాతీయ రహదారి నిర్మించినప్పటి నుంచి ఇప్పటివరకు కాలువలో పెరుకుపోయిన చెత్తా, చెదారాలు తీయకపోడంతో కాలువలోని మురుగునీరు రోడ్డెక్కి ప్రవహిస్తోంది. దీంతో రాత్రి సమయాల్లో దోమలతో ఇబ్బందులు పడుతూ నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అటుగా వెళ్లే వాహనచోదకులు కూడా దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా హైవే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలువలో పెరుకుపోయిన చెత్తను తొలగించి, మురుగునీరు ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ ఈఓ రామకృష్ణ వద్ద ప్రస్తావించగా.. విషయం తన దృష్టికి వచ్చిందని, ఇప్పటికే హైవే అధికారులతో మాట్లాడామని చెప్పారు. త్వరలోనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



జాతీయ రహదారిపై పారుతున్న మురుగునీరు

విధి నిర్వహణలో అలసత్వం తగదు

- ఇన్‌చార్జ్ ఆర్డీఓ పద్మలత

బొబ్బిలి రూరల్: ఈ నెల 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, విధి నిర్వహణలో అలసత్వం తగదని చీపురుపల్లి ఎస్డీసీ, బొబ్బిలి ఇన్‌చార్జ్ ఆర్డీఓ కె.పద్మలత ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిస్ట్రిబ్యూషన్ సిబ్బంది, ఇతర సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి పలువురు ఆలస్యంగా రావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం డిస్ట్రిబ్యూషన్ మెటీరియల్ ఏ విధంగా కౌంటర్లలో సిబ్బందికి అందించాలో వివరించారు. ఆమె వెంట తహసీల్దార్ ఎస్.రాజారావు, ఎన్నికల డీటీ ఈశ్వరమ్మ, తదితరులున్నారు.